క్లుప్తంగా

మహిళలకు దుస్తుల పంపిణీ



రమణయ్యపేటలో పేద మహిళలకు దుస్తులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు నూతన దుస్తులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దాన గుణం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టరు అద్దాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, ఓం నమశ్శివాయ, ఎస్. శ్రీనగేష్, తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షా కేంద్రాల పరిశీలన



నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య కళాశాల అర్హత పరీక్షా ఆదివారం కాకినాడ జేఎన్‌టీయూకే కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో నిర్వహించారు. ఈ నీట్ పరీక్షా కేంద్రాలను కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న డీసీసీబీ సిబ్బంది

బోట్‌క్లబ్: జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం డీసీసీబీ అధికారులు, సిబ్బంది మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ అధ్యక్షులు వైడీ రామారావు ప్రారంభించారు. డీసీసీబీ సీఈవో ఆర్‌వీ నరసింహారావు మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ జియం ప్రవీణ్‌కుమార్, డిజియం శ్రీధర్ పాల్గొన్నారు.

మహానుభావుడు భగీరథ మహర్షి



భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

కాకినాడ సిటీ: భగీరథ మహర్షి తన అకుంఠిత దీక్షా, పట్టుదలతో అఖండ ప్రాణికోటికి నీరు అందించిన గొప్ప మహానుభావుడని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. ఆదివారం భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి రామమోహన్‌రావు, జగన్నాథం, సగర సంక్షేమ సంఘం సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మనం ధరించే ఆభరణం చిరునవ్వు

బోట్‌క్లబ్: మనం ధరించగలిగే అత్యుత్తమ అభరణం చిరునవ్వు అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న సత్య దంత వైద్యశాల సమావేశ మందిరం ఆదివారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ చిరునవ్వుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవ్వడం ఒక యోగం, నవ్వలేకపోవడం ఒక రోగం అని మన పెద్దలు చెప్పారన్నారు. నవ్వడం వల్ల శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ తగ్గుముఖం పడుతుందని ఈ హార్మోన్ ఎక్కువగా ఒత్తిడి ఉన్న వారిలో ఉంటుందని, నవ్వడం వల్ల ఈ కార్టిసాల్ హార్మోన్ కంట్రోల్ అవుతుందన్నారు. ఇందుకోసం లాఫింగ్ థెరఫీ అనే ఒక ప్రత్యేక చికిత్స విధానం కూడా కనిపెట్టారని, తనివితీరా నవ్వుకోవడం వల్ల ఎలాంటి జబ్బులు రావని, నిజానికి నవ్వడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్వరూప్, సాయి కార్తీక్ పాల్గొన్నారు.

గాంధీనగర్ రైతు బజార్‌కు నేడు సెలవు

బోట్‌క్లబ్: గాంధీనగర్ రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే యువరైతు తాటికొండ వీరభద్రస్వామి (రవి) అనారోగ్యంతో మృతి చెందాడు. అతని మృతికి సంతాపంగా సోమవారం సెలవు ప్రకటించినట్టు రైతుబజార్ ఎస్టేట్ అధికారి యర్రంశెట్టి శివ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం

- పూర్తి కాని రబీ మాసూళ్లు
- కోతల వేళ వర్షం కురవడంతో నేలను కూలిన చేలు
- రోడ్డు పక్కన, మడులలోనే ధాన్యపు రాశులు

కాకినాడ రూరల్: ప్రకృతి ప్రకోపించిందంటే ముందుగా నష్టపోయేది రైతన్నే. ఆరుగాలం కష్టించి పండించే పంట చేతికి అందే తరుణంలో మొత్తం నాశనం చేస్తుంది. ప్రస్తుతం రాబీ మాసూళ్లు జరుగుతున్నాయి. ధాన్యలక్ష్మి ఇంటి వస్తుందని ఎదురుస్తున్న రైతుల ఆశలపై అకాల వర్షం నీళ్లు చల్లింది. ఈ సీజనల్‌లో ప్రస్తుతం రబీ మాసూళ్లు జోరుగా సాగుతున్నాయి. కాకినాడ రూరల్‌లో సుమారు 4500 ఎకరాలు రబీ వరిసాగును రైతులు చేపట్టగా ఇప్పటికి 1250 ఎకరాలలో మాత్రమే మాసూళ్లు పూర్తయ్యాయి. సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 11వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉండగా చాలా చోట్ల వరి చేలు కోతలు కోయాల్సి ఉంది. కొన్ని చోట్ల ధాన్యపు రాసులు మడులు, రోడ్లపై ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం పడిన వర్షం నుంచి రైతులు తేరుకోక ముందే ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీగా వర్షించింది. దీంతో ఎక్కడిక్కడ నీరు నిలిచిపోయింది. వరి చేలు నేలను తాకడంతో పాటు కొన్ని చోట్ల ధాన్యపు రాసులు తడిచిపోయాయి. తిమ్మాపురం ఏడీబీ రోడ్డు పొడవునా ధాన్యపు రాశులను బరకాలతో మూసి రైతులు కాపాడుకునే ప్రయత్నం చేయగా సర్పవరంలో కొన్ని ధాన్యపు రాసులు తడిచిపోయాయి. రైతులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా తడచిన ధాన్యం కొనుగోలు చేయాలని సర్పవరం రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అన్నదాత కుదేలు

కరప: అకాల వర్షం రైతులను నిండా ముంచింది. ఆదివారం అనుకోకుండా కురిసిన వర్షానికి కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిముద్దయ్యాయి. కోసి పనలపై ఉన్న పంట నీటిపాలైంది. మండల పరిధిలో 14 వేల ఎకరాల్లో రబీపంట సాగు చేశారు. ముందుగా నాటిన పొలాల్లో కోతలు పూర్తవ్వగా, ఆలస్యమైన ప్రాంతాల్లో మాసూళ్లలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎండలు బాగా కాస్తుండడంతో కూలీలతో, కోత మెషీన్లతో వ్యవసాయ పనులు ముమ్మరంగా చేస్తున్నారు. వరికోత యంత్ర పరికరాలతో కోసిన ధాన్యం కళ్లాల్లోనూ, రోడ్డుపక్కన, లేఅవుట్లలో తేమ శాతం పోవడానికి ధాన్యాన్ని ఆరపెట్టుంటున్నారు. ఒక్కసారిగా మేఘావృతమై వర్షం పడడంతో కళ్లాల్లో ఆరపెట్టిన ధాన్యం తడిసి పోయింది. కోత, నూర్పిడి యంత్రంతో కోసిన మళ్లల్లో గడ్డిని రెండు మూడు రోజులు ఎండిన తర్వాత పశుగ్రాసం కోసం బాగువుతుంది. వాతావరణం బాగుండి, ఎండలు కాస్తుండడంతో ధాన్యం రాశులపై బరకాలతో సరిగా కప్పలేదు. కోసిన గడ్డి మళ్లల్లో ఉండిపోయి తడిసిపోయింది. కూలీలతో కోసిన వరిపంట పనమీద ఉండిపోవడంతో తడిసిపోయిందని రైతులంటున్నారు.



కొరిపల్లి వద్ద లే అవుట్‌లో ధాన్యం రాశులు



పాతర్లగడ్డలో తడిసిపోయిన పశుగ్రాసం కట్టలు



వలసపాకల లే అవుట్‌లో బరకాలతో కప్పిన ధాన్యపు రాశులు



తిమ్మాపురం ఏడీబీ రోడ్డులో వర్షానికి బరకాల నీడన ధాన్యపు రాశులు

మిల్లర్లకే మద్దతు ధర

మద్దతు ధర 75 కిలోల బస్తాకు రూ.1725 అని చెప్పారు. కానీ మిల్లర్లు, కమీషన్ వ్యాపారస్తులు కుమ్మక్కై, రేటు తగ్గించి కొంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు సేవా కేంద్రాలకు రవాణాకు ట్రాక్టర్లను అద్దెకు పెట్టుకోమంటున్నారని, సీఎంఆర్‌కు అయితే మిల్లు వద్ద రెండు మూడు రోజులకు కానీ దిగుమతికాక ఎవరూ కొనడం లేదంటున్నారు. క్యాస్ పేరుతో మిల్లర్లు ధర తగ్గించి కొంటున్నారని రైతులు తెలిపారు. ఈ వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో ధర ఇంకా తగ్గించేస్తారని వాపోతున్నారు. తేమశాతం ఉందని, ముక్కిపోయాయని, రంగుమారాయని వంకలు పెట్టి రూ.1500 కొంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మద్దతు ధర మిల్లర్లకే కానీ, రైతులు కాదంటున్నారు. ప్రభుత్వం స్పందించి తేమ శాతం చూడకుండా మద్దతు ధరకు కొనేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

తగ్గుతున్న ధర



పేరుకే మద్దతు ధర. రైతుకు అందడంలేదు. మిల్లర్లు ధాన్యం ధరను ఇంకా తగ్గించేస్తున్నారు. శుక్రవారం వరకు క్యాస్ బేరం అంటూ 75 కిలోల బస్తా రూ.1600 లకు కొనేవారు. శనివారం రూ.1550 అన్నారు. ఆదివారం రూ.1500 అంటున్నారు. ఇలా అయితే వ్యవసాయం చేయలేం. అధికారులు స్పందించాలి. ధన్యాన్ని మద్దతు ధరకు కొనేలా చర్యలు తీసుకోవాలి

– వడ్డి చంద్రరావు, రైతు, కరప

అప్పులే మిగిలేలా ఉన్నాయి



నాలుగు ఎకరాలు కౌలుకు చేస్తున్నారు. రెండు ఎకరాలు కోయకుండానే ఈదురు గాలులకు పడిపోయింది. రెండుఎకరాలు కోసి, కళ్లంలో ఎండ పెట్టాను, బరకాలు కప్పినా, అడుగు నుంచి నీరు రావడంతో తడిసిపోయింది. అమ్ముదామంటే అయినకాడికి అడుగుతున్నారు. బస్తా రూ.1500 లకు అమ్మితే పెట్టుబడి, మగతాకు సరిపోవడం లేదు. అప్పులే మిగిలేలా ఉన్నాయి.

– వాసంశెట్టి అప్పారావు, కౌలురైతు, వలసపాకల

అపూర్వ కలయిక



కరపలో కలుసుకున్న 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1999–2000 సంవత్సర బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కరపలో కలుసుకుని సందడి చేశారు. పూర్వవిద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుంటూ, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సందడి చేశారు. రెండున్నర దశాబ్దాల తరువాత కలుసుకుని వీరు ఒకరికొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. ఈసందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి పూర్వవిద్యార్థులు గురుభక్తిని చాటుకున్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

కాకినాడ రూరల్: సండే రోజు ప్రశాంతంగా ఇంట్లో ఉన్న జనాలు వేసవి వేళ చల్లని ఆహ్లాదకరమైన వాతావరణం అనుభవించారు. రోజంతా వాతావరణం చల్లగా ఉండగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా పడిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు, వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. పలు చోట్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు డ్రైనేజిలోకి పోయేలా మార్గం లేకపోవడంతోనే సమస్య తలెత్తుతోందని, డ్రైనేజిలకు నీరు పోయే మార్గాలను ఏర్పాటు చేయాలని గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

కరప మండలంలో..

కరప: మండల పరిధిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. పల్లపుప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అధిక వర్షానికి డ్రైన్లు లేక నడకుదురు, పెనుగుదురు, కరప, గొడ్డటిపాలెం, కూరాడ, గురజనాపల్లి తదితర గ్రామాల్లో రోడ్లపైనే వర్షపు నీరు ప్రవహించింది. ప్రజలు రాకపోకలు ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలులకు మామిడికాయలు రాలిపోయి, నష్టం వాటిల్లినట్టు మామిడి రైతులు అంటున్నారు. అయితే ఉక్కపోతతో ఉన్న ప్రజలకు వర్షానికి సేదతీరారు.



వలసపాకల గంగరాజు నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



నడకుదురులో కురుస్తున్న వర్షం



సూర్యారావుపేట బీచ్‌లో కబడ్డీ పోటీల కోర్టుకు సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



కరప ఎంఈఓ కార్యాలయానికి వెళ్లేదారిలో చెరువును తలపిస్తున్న వాననీరు

మాతృత్వం ఓ మధుర జ్ఞాపకం

కాకినాడ క్రైం: గర్భంలో బిడ్డను మోసి ప్రసవించే వ్యవధి తొమ్మిది నెలలే అయినా, తల్లికి ఆ మాతృత్వపు మధురానుభూతి మాత్రం ఓ జీవిత కాలపు జ్ఞాపకమని, అటువంటి అమ్మ తనానికి గైనకాలజిస్టులుగా అన్ని విధాలా భద్రత, భరోసా కల్పించగలగడమే అభ్యసించిన విద్యకు సార్థకత అని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. ఆదివారం కాకినాడలోని ఐఎంఏ హాల్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఆబ్‌స్ట్రిటిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా(ఫాగ్సీ) కాకినాడ జిల్లా కార్యదర్శి, సృజన మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ ఏఎల్ సత్యవతి ఆధ్వర్యంలో ప్రసూతి వైద్య నిపుణుల ప్రతిష్టాత్మక సదస్సు ఫాగ్సీ నిర్వహించారు. రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఐఎంఏ నగర అధ్యక్షుడు ఎం.పవన్‌కుమార్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఫాగ్సీ అధ్యక్షురాలు, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, డాక్టర్ సత్యవతి, డాక్టర్ నరసింహం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ ప్రసూతి వైద్య విధానాలు గడచిన దశాబ్ద కాలంలో ఆధునికతను సంతరించుకున్నాయన్నారు. మెటర్నల్ ఇమ్యునైజేషన్ అంశంపై చర్చా గోష్టి నిర్వహించి హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యత, మహిళలు, బాలికలకు ఇవ్వాల్సిన ఆవశ్యకతను వివరించారు. సదస్సులో ఎఫ్‌డీఎంఎస్‌ఈసీ సభ్యురాలు డాక్టర్ వి.పద్మజ, డాక్టర్ సరస్వతి సహా గైనకాలజీ, అనుబంధ స్పెషలిస్టులు వక్తలుగా వ్యవహరించారు. సదస్సు అనంతరం డాక్టర్ నరసింహం దంపతులను ఫాగ్సీ బృందం ఘనంగా సత్కరించింది.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ ఏఎల్ సత్యవతి చిత్రంలో డాక్టర్ నరసింహం, డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ అనురాగమయి

8న మహాలక్ష్మీ అమ్మవారి ఉత్తర నక్షత్ర పూజలు

సామర్లకోట: స్థానిక గోదావరి నదీ తీరంలో ఉన్న అతి పురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి ఆలయంలోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఉత్తర నక్షత్రను పురస్కరించుకొని ఈ నెల 8వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి, ఆలయ పండితులు రవికుమార్ ఆచార్యులు విలేకరులకు తెలిపారు.

నేడు బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

పిఠాపురం: ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు చిత్తూరులో జరగనున్న ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక సోమవారం నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. రామచంద్రపురం కంతేటి పేర్రాజు పంతులు హైస్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి ఎంపిక ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 1- 1- 2012 సంవత్సరం తరువాత పుట్టిన వారే ఉండాలన్నారు. పాల్గొను క్రీడాకారులు పుట్టిన సర్టిఫికెట్ ఆధార్ కార్డు ఒరిజినల్ తీసుకుని రావాలని ఆయన కోరారు.

కాండ్రకోట నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చు ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి ఐదో ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమవాస్య మాసం పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ ఆర్.సౌజన్య, ఉత్సవ ప్రత్యేకాధికారి వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దాపురం సీఐ విజయ్‌శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు కల్పించారు. సుమారు వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రేక్షకుల గుండెల్లో నిలిచిన దాసరి



కళాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్

బోట్‌క్లబ్: సినీ రంగంలో ఒక శక్తిగా ఎదిగిన దాసరి నారాయణరావు ప్రేక్షకుల గుండెల్లో ఎప్పుడూ చిరస్థాయిగా ఉంటారని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. అఖిలభారత దాసరి యువశక్తి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గోడి వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన జయంతిని నిర్వహించారు. 150 పైగా సినిమాలకు దర్శకత్వం వహించి , 53 చిత్రాలు నిర్మించారన్నారు. ఎన్నో సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారన్నారు. గోడి వెంకట్ మాట్లాడుతూ ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు దాసరి స్కాలర్‌షిప్‌లు ఇచ్చారన్నారు. ఆయన రాజ్యసభ సభ్యులుగా ఉన్న సమయంలో నగరంలో పలు అభివృద్ధి పనులుకు నిధులు మంజూరు చేశారన్నారు. అనంతరం 15 మంది కళాకారులను సత్కరించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాలకొండయ్య, పేరూరు సత్యనారాయణ, కోడిగుడ్డు సత్యనారాయణ, రాంబాబు, శ్రీనివాసరావు, బాబూరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొత్తపల్లి: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై జి.వెంకటేష్ అన్నారు. ఉప్పాడ- కాకినాడ బీచ్‌రోడ్డులో ఆదివారం యువతకు మత్తు పదార్థాల వల్ల నష్టాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మత్తుకు అలవాటైతే ప్రమాదాల్లో పడతారని, మద్యంకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. తీరప్రాంతాల్లో సేద తీరే పర్యాటకులు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసుల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ఘనంగా భీమకవి విగ్రహ ప్రతిష్ఠ

కరప: వేములవాడలో తుల్యభాగ నదీ తీరాన శివాలయానికి ఎదురుగా నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం వేములవాడ భీమకవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2023లో అప్పటి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేయగా, గ్రామస్తులు, భక్తులు ఇచ్చిన విరాళాలతో ఆలయాన్ని నిర్మించారు. రావులపాలెం మండలం రావులపాడు గ్రామస్తులు శైవాగమ ప్రతిష్టాచార్య బహు సువర్ణసింహాతలాట గ్రహీతలు బ్రహ్మశ్రీ పూజ్యం విశ్వనాథశివాచార్య, భైరవబొట్ల మాచరి బ్రహ్మాజీశర్మ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి వేములవాడ భీమకవి విగ్రహ ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా 6 వేల మందికి అన్నదానం చేశారు. కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, గ్రామసర్పంచ్ కమిడి మంగాదేవి, కరప డీసీసై ర్మన్ పీజీ సత్యనారాయణ, మాజీసర్పంచ్‌లు బండే తాతాజీ, అప్పనపల్లి శ్రీవెంకటనారయ్య, పాలిక సూరిబాబు, మాజీఎంపీపీ కమిడి సీతామహాలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు భీమకవిని దర్శించుకున్నారు.



వేములవాడలో ప్రతిష్ఠించిన వేములవాడ భీమకవి

తైక్వాండో వేసవి శిక్షణ ప్రారంభం



వివేకానంద పార్కులో తైక్వాండో శిక్షణకు హాజరైన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): తైక్వాండో వేసవి శిక్షణా శిబిరం ఆదివారం ప్రారంభించారు. స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో రాహుల్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరానికి జిల్లా క్రీడాభివృద్ధిఅధికారి బి.శ్రీనివాస్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. శాప్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జరిగే వేసవి శిక్షణ శిబిరాలకు రూ.7వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో రాణించిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు, రాహుల్ తైక్వాండో క్లబ్ నిర్వాహకులు, కోచ్ సత్యన్నారాయణ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి నూకరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో వారం వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఈ ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.